సాక్షి
కామారెడ్డి
బుధవారం । 18 । జూన్ । 2025



## వేగవంతం చేయాలి

లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు.

- 8లో ▸



## నిబంధనలు తూచ్

బీర్కూర్ మండలంలోని మంజీర నదిలోంచి నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ఇసుక తోడేస్తున్నారు.

- 8లో ▸

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.9 /23.5

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### 20న కలెక్టరేట్‌లో దిశ సమావేశం

కామారెడ్డి అర్బన్: జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో దిశ (జిల్లా అభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ) సమావేశం నిర్వహించనున్నారు. ఈ విషయమై డీఆర్‌డీవో సురేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలపై సమీక్ష కోసం నిర్వహించే సమావేశానికి జిల్లాలోని ఎమ్మెల్యేలు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

### ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: గ్వాలియర్‌లోని లక్ష్మీబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో వివిధ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి గలవారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి జగన్నాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్, పీజీ ఇన్ స్పోర్ట్స్ కోచింగ్, పీజీ ఇన్ ఫిట్‌నెస్ కోచింగ్, పీజీ డిప్లొమా ఇన్ స్ట్రెంత్ అండ్ స్పోర్ట్స్ కండిషనింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

**ఓపెన్ డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశాలకు..**

కామారెడ్డి అర్బన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు వర్సిటీ కామారెడ్డి స్టడీ సెంటర్ సమన్వయకర్త సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆగస్టు 13 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**ఓపెన్ డిగ్రీ పరీక్షల ఫీజు చెల్లించాలి**

కామారెడ్డి అర్బన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సరాల (2015నుంచి బ్యాక్‌లాగ్, రీ అడ్మిషన్) విద్యార్థులకు జూలై, ఆగస్టు నెలల్లో పరీక్షలుంటాయని సుధాకర్ తెలిపారు. ఈనెల 20వ తేదీలోగా ఇందుకు సంబంధించిన పరీక్ష ఫీజు చెల్లించాలని, 500 అపరాధ రుసుముతో ఈనెల 26 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

### యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కామారెడ్డి టౌన్: నిత్యం యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఒక్కరు యోగా సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వైద్యాధికారి దేవయ్య, జిల్లా ఆయుష్ ప్రోగ్రాం మేనేజర్ ఆకుల శ్రీకాంత్, డీఈఎంవో వేణుగోపాల్, హెచ్‌ఈవో చలపతి, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం అధికారి పద్మజ, యోగా శిక్షకుడు లింగమూర్తి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ‘హిందీ భాషాభివృద్ధికి పాటుపడాలి’



కామారెడ్డి అర్బన్ : హిందీ భాష ఎంతో గొప్పదని, ఆ భాష అభివృద్ధికి అంతా పాటుపడాలని హిందీ సాహిత్య మంచ్ జిల్లా ప్రతినిధి గఫూర్ శిక్షక్ పేర్కొన్నారు. మంగళవారం కామారెడ్డి కర్షక్ బీఈడీ కళాశాలలో హిందీ సాహిత్య సమావేశం నిర్వహించారు. హిందీ భాష ఔన్నత్యం తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో హిందీ సాహిత్య మంచ్ జిల్లా ప్రతినిధులు వంశీధర్, లింగం, శ్యాం, రవికిరణ్, ఆదినారాయణ, సుదర్శన్, నర్సింలు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

### రైతుల ఖాతాల్లో రూ. 169 కోట్లు జమ

కామారెడ్డి క్రైం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ అవుతున్నాయి. మంగళవారం సాయంత్రం వరకు జిల్లాలో 2,47,908 మంది రైతుల ఖాతాల్లో రూ. 169.48 కోట్లు జమ చేశామని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఇందులో కామారెడ్డి నియోజకవర్గంలోని 59,364 మంది రైతులకు గాను రూ.40.07 కోట్లు, ఎల్లారెడ్డి పరిధిలో 87,777 మంది రైతులకు రూ.59 కోట్లు, బాన్సువాడ పరిధిలో 27,537 మంది రైతులకు రూ.17.36 కోట్లు, జుక్కల్ పరిధిలో 73,230 మంది రైతులకు రూ.53.02 కోట్లు జమ చేశామని వివరించారు.

మద్నూర్‌లో విత్తనాలు వేస్తున్న రైతులు



# వానమ్మా.. రావమ్మా..

**ఎండలు మండే రోహిణి కార్తెలోనే** కురిసిన భారీ వర్షాలతో కాలం ముందే వచ్చిందని అన్నదాతలు సంబుర పడ్డారు. రుతుపవనాలు ముందే వస్తున్నాయన్న వాతావరణ శాఖ సూచనలతో పొలాలను దున్ని సాగుకు అనుకూలంగా మార్చుకున్నారు. మృగశిర కార్తె ప్రవేశం రోజు కురిసిన ఓ మోస్తరు వర్షంతో మరింత ఆనందించారు. అయితే ఆ తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో రైతుల్లో ఆందోళన మొదలయ్యింది.

- మృగశిర కార్తె ప్రవేశం రోజు ఓ మోస్తరు వర్షం
- ఊరించి ఉసూరుమనిపించిన వరుణుడు
- వారం రోజులుగా జాడలేని చినుకు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : వానాకాలం సీజన్ ప్రారంభం కాకముందే జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. రుతుపవనాలు ముందుగానే రావడంతో మంచి వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాస్త్రవేత్తల ప్రకటనలతో రైతులు పంటల సాగుపై అనేక ఆశలు పెంచుకున్నారు. దీంతో చాలా ప్రాంతాల్లో రైతులు భూములను దున్ని విత్తనాలు వేసేందుకు రెడీ అయ్యారు. కొన్ని ప్రాంతాల్లో విత్తనం వేస్తున్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో వర్షాలపై ఆధారపడి సేద్యం చేస్తున్నవారు సోయా, పత్తి, పెసర, మక్క విత్తనాలు వేస్తున్నారు. వారం పది రోజులుగా వర్షం లేకపోవడంతో కొంత ఇబ్బందిగా ఉందని అంటున్నారు. అయితే రేగడి భూముల్లో తేమ ఉండడంతో విత్తనాలు వేయడానికి సమస్య లేకపోవడంతో ఆ భూముల్లో విత్తనాలు వేస్తున్నారు.

**బోర్లలో పెరగని ఊట..**

ఈ సీజన్ ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు జిల్లాలో 71.3 మి.మీ. సాదారణ వర్షాపాతం నమోదు కావాల్సి ఉండగా, 88.7 మి.మీ. వర్షం కురిసింది. అయితే చాలా ప్రాంతాల్లో సాధారణం కూడా కురవలేదు. కొన్ని ప్రాంతాల్లోనే ఒకటి రెండు గట్టి వర్షాలు పడ్డాయి. మిగతా ప్రాంతాల్లో జల్లులు మాత్రమే కురిశాయి. భారీ వర్షాలు లేకపోవడంతో ఒర్రెలు పారలేదు. దీంతో భూగర్భ జలాలు పెరగక బోర్లు కుదురుకోలేదని రైతులు అంటున్నారు. మొన్నటి యాసంగి సీజన్‌లో భూగర్భ జలమట్టం పడిపోయి పంటలకు నీరందక చాలాచోట్ల ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. రీ వర్షాలు కురిసి వాగులు పొంగితేగానీ భూగర్భ జలమట్టం పెరిగే పరిస్థితులు కనిపించడం లేదు. బోర్లు కుదురుకోకుండా పంటలు సాగు చేయడం కూడా కష్టమేనని రైతులు అంటున్నారు. కొద్ది మంది రైతులే ధైర్యం చేసి బోర్ల వద్ద వరి నారు పోస్తున్నారు. చాలామంది భూగర్భ జలాలు పెరిగిన తర్వాతే నార్లు పోయాలని భావిస్తున్నారు.



మద్నూర్‌లో విత్తనాలు వేస్తున్న రైతులు

### కమ్ముకొస్తున్నా వర్షించని మేఘాలు

జిల్లాలో నిత్యం మేఘాలు కమ్ముకొస్తున్నాయి. ఒక్కసారిగా వాతావరణం మారిపోయి భారీ వర్షం వస్తుందనుకునేలోపు మేఘాలు కనుమరుగవుతున్నాయి. గాలిదుమారం, మెరుపులు, ఉరుములు తప్ప వర్షాలు కురిసింది లేదు. మరో వైపు పగటిపూట ఎండ తీవ్రంగా ఉంటోంది. ఎండలు మండుతుండడంతో భూమిలో ఉన్న తడి కూడా ఆవిరవుతోంది. ఎండల తీవ్రతకు వేసిన విత్తనం మొలకెత్తుతుందో లేదోనన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది. వరుణుడి కరుణ కోసం ఆశతో ఎదురుచూస్తున్నారు.

# అతిథి అధ్యాపకులొచ్చారు

- జిల్లాలో 58 మంది గెస్ట్ లెక్చరర్ల నియామకం
- ఇంటర్ కళాశాలల్లో తీరనున్న అధ్యాపకుల కొరత

నాగిరెడ్డిపేట : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లను నియమించారు. దీంతో కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీరనుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పూర్తిస్థాయిలో అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఫలితాల్లో జిల్లా అట్టడుగున నిలుస్తోంది. ఈ నేపథ్యంలో ఖాళీలున్న చోట గెస్ట్ లెక్చరర్లను నియమించి బోధన సాగేలా చూసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో మొత్తం 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా.. అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉన్న 13 కళాశాలల్లో 58 మంది గెస్ట్ లెక్చరర్లను నియమించారు. జిల్లాలో ఇటీవల ఏర్పాటు చేసిన నాగిరెడ్డిపేట, బీబీపేట, నిజాంసాగర్, బీర్కూర్ కళాశాలల్లో ఒక్కరిద్దరు అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. ఆయా కళాశాలల్లో సబ్జెక్టులను బోధించడానికి అతిథి అధ్యాపకులను నియమించడంతో సమస్య తాత్కాలికంగా పరిష్కారమైంది. కాగా జిల్లాలో మరో 16 మంది గెస్ట్ లెక్చరర్లను నియమించడానికి జిల్లా అధికారులు ప్రణాళికలు రూపొందించి ఇంటర్ బోర్డుకు పంపారు. ఇంటర్ బోర్డ్ నుంచి అనుమతులు రాగానే ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు.

**కళాశాలలవారీగా నియమించిన గెస్ట్ లెక్చరర్ల వివరాలు..**

| కళాశాల | గెస్ట్ లెక్చరర్లు | కళాశాల | గెస్ట్ లెక్చరర్లు |
|---|---|---|---|
| బాన్సువాడ (కో ఎడ్యుకేషన్) | 03 | నాగిరెడ్డిపేట | 08 |
| | | దోమకొండ | 01 |
| బాన్సువాడ (గర్ల్స్) | 03 | భిక్కనూరు | 02 |
| | | కామారెడ్డి | 04 |
| బీర్కూర్ | 07 | బీబీపేట | 08 |
| సదాశివనగర్ | 01 | మద్నూర్ | 01 |
| తాడ్వాయి | 02 | నిజాంసాగర్ | 09 |
| | | బిచ్కుంద | 09 |
| | | మొత్తం | 58 |



నాగిరెడ్డిపేట కళాశాలలో నియమితులైన అతిథి అధ్యాపకులు

# జిల్లా పోలీస్ శాఖకు కొత్త లోగో

- ఆవిష్కరించిన ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం : ‘ఫియర్‌లెస్ ఆల్వేస్ – విజిలెంట్ ఫరెవర్ ’ (ఎల్లవేళలా నిర్భయంగా.. అప్రమత్తంగా..) నినాదంతో కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖ నూతన లోగోను రూపొందించింది. దానిని మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాజేశ్ చంద్ర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసింగ్‌లో ధైర్యం, అప్రమత్తత, పారదర్శకతను ప్రతిబింబించడమే కాకుండా, పోలీసింగ్‌లో వస్తున్న మార్పులకు ప్రతీకగా లోగోను రూపొందించామన్నారు. లోగోలోని నినాదం జిల్లా పోలీసుల నిబద్ధతను స్పష్టంగా వ్యక్తపరుస్తుందన్నారు. ఇందులో ఉన్న నినాదానికి తగినట్లుగా పని తీరు ఉంటుందని పేర్కొన్నారు. పోలీసింగ్‌ను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రజల భద్రత కోసం ప్రతి అధికారి సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, అసిస్టెంట్ ఎస్పీ చైతన్యరెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్‌రావు, యాకూబ్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

KAMAREDDY POLICE
FEARLESS ALWAYS, VIGILANT FOREVER



జిల్లా పోలీస్ శాఖ నూతన లోగోను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర, పోలీస్ అధికారులు

# ‘నిజాయితీగా పని చేయాలి’

కామారెడ్డి క్రైం: ప్రతి పోలీసు అధికారి నీతినిజాయితీలతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌ల వారీగా కేసుల వివరాలు, విచారణ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో జాప్యం చేయవద్దన్నారు. గ్రేవ్ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం అందించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరిస్తూ ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలను ఏర్పరచుకోవాలని, సమాచార వ్యవస్థను మరింత పటిష్టం చేసుకోవాలని సూచించారు. ప్రమాదాల నివారణలో భాగంగా నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో బీట్ సిస్టంను మరింత పటిష్టం చేయాలన్నారు. డయల్ 100 కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలన్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, కామారెడ్డి అసిస్టెంట్ ఎస్పీ చైతన్యరెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్‌రావు, విఠల్‌రెడ్డి, ఎస్బీ సీఐ తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.



నెలవారీ సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

# భూ సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి క్రైం : రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, భూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. మంగళవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్‌లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికే ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. అన్ని దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తహసీల్దార్ జనార్దన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### నాణ్యమైన ఉత్పత్తులను ఎగుమతి చేయాలి

కామారెడ్డి క్రైం : జిల్లా నుంచి నాణ్యమైన ఉత్పత్తులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎగుమతుల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యత గల బియ్యం, మొక్కజొన్న, సోయాబీన్‌లాంటి ఉత్పత్తులు ఎగుమతి చేయాలన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడంలో భాగంగా జిల్లా మహిళా సమాఖ్య ద్వారా రైస్ మిల్, పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ శైలజ, ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్ నాయక్, డీఆర్డీవో సురేందర్, డీఏవో తిరుమల ప్రసాద్, ఎల్‌డీఎం చంద్రశేఖర్, మార్కెటింగ్ అధికారి రమణ, రైస్ మిల్లర్లు, వ్యాపారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

# మెడికల్ కాలేజీపై ఎన్‌ఎంసీ అసంతృప్తి!

- తాత్కాలిక భవనంలో మెడికల్ కళాశాల.. అద్దె భవనాల్లో హాస్టళ్లు
- ఇరుకు భవనంలో జీజీహెచ్..
- సౌకర్యాలు, వసతులు సరిగా లేక ఇబ్బందులు
- కళాశాలలో మూడో ఏడాది అనుమతులపై సందిగ్ధత
- నేడు వైద్య కళాశాలల ప్రిన్సిపల్స్‌తో డీఎంఈ వర్చువల్ మీటింగ్

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల నిర్వహణపై జాతీయ వైద్య కమిషన్(ఎన్‌ఎంసీ) బృందం అసంతృప్తి వ్యక్తం చేసింది. 2025–26 ఏడాదికి ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు కోసం రాష్ట్రంలోని అన్ని మెడికల్ కళాశాలల్లో ఇటీవల ఎన్‌ఎంసీ బృందం తనిఖీలు నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా 26 ప్రభుత్వ కళాశాలల్లో సమస్యలు, లోపాలు ఉన్నట్లు గుర్తించింది. ఈ జాబితాలో కామారెడ్డి వైద్య కళాశాల కూడా ఉంది.

**నత్తనడకన భవన నిర్మాణ పనులు**

ప్రస్తుత మెడికల్ కళాశాల వెనకాల 20 ఎకరాల స్థలంలో రూ. 130 కోట్లతో భవన నిర్మాణం చేపట్టారు. ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నూతన కళాశాల, తరగతి గదులు, క్రిటికల్ కేర్, ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ కార్యాలయాలు, క్వార్టర్స్, బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్, క్యాంటీన్ తదితర భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. భవనం పనులు ఇప్పటివరకు 60 శాతమే పూర్తయ్యాయి.

**ఇరుకు భవనాల్లో ఇబ్బందులు...**

మాతాశిశు సంరక్షణ ఆస్పత్రి కోసం నిర్మించిన భవనంలో వైద్య కళాశాల కొనసాగుతోంది. గదులు సరిపోక రెండు రేకుల షెడ్లు వేసి అనాటమీ, ల్యాబ్‌లు ఆయ విభాగాలతో పాటు క్లాస్ రూంలు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌రోడ్‌లో 100 పడకల సామర్థ్యం గల భవనాన్ని ఏకంగా 330 పడకలకు పెంచి జీజీహెచ్‌ను కొనసాగిస్తున్నారు. ఇక్కడ అన్ని విభాగాలు ఇరుకుగా మారాయి. పార్కింగ్‌కు సరిపడా స్థలం లేదు. రోగులతోపాటు వైద్యులూ ఇబ్బందులు పడుతున్నారు.

**అద్దె భవనాల్లో..**

మెడికల్ కళాశాలకు 2 కిలోమీటర్ల దూరంలో అశోక్ నగర్ కాలనీలో మెడికల్ బాయ్స్, గర్ల్స్ కోసం వేర్వేరుగా భవనాలను అద్దెకు తీసుకుని హాస్టళ్లను ఏర్పాటు చేశారు. విద్యార్థులు కళాశాలకు వెళ్లిరావడానికి రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు.

**హాజరు సరిగా లేక..**

కామారెడ్డి మెడికల్ కాలేజీ వంద ఎంబీబీఎస్ సీట్లతో 2023లో ప్రారంభమైంది. దేవునిపల్లిలో నిర్మించిన ఎంసీహెచ్ భవనంలో కళాశాలను ప్రారంభించారు. ఏరియా ఆస్పత్రిని 330 పడకలకు పెంచి జనరల్ ఆస్పత్రిగా మార్చి వైద్య కళాశాల అధీనంలో కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం రెండు బ్యాచ్‌ల విద్యార్థులు 200 మంది ఇక్కడ ఎంబీబీఎస్ చదువుతున్నారు. కళాశాల వైద్య బృందం, ప్రొఫెసర్లు, టీచింగ్, నాన్ టీచింగ్, విద్యార్థులకు సంబంధించిన బయోమెట్రిక్ హాజరు నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ఎంఎన్‌సీ మొట్టికాయలు వేసింది. ఎన్‌ఎంసీ చేసిన ఆదేశాల మేరకు ప్రధానంగా వైద్య విద్యార్థులకు కావాల్సిన బోధనా సిబ్బంది లేరు. 30 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**డీఎంఈ సమావేశంపై దృష్టి..**

ఏటా ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి ముందు ఎన్‌ఎంసీ బృందం తనిఖీలు చేసి నివేదికలు ఇస్తుంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులు, అధ్యాపకులు, హాజరు నమోదు, అనుబంధ ఆస్పత్రిలో చికిత్స, వైద్య పరికరాలను పరిశీలించి సంతృప్తి చెందితే అనుమతులు జారీ చేస్తారు. వచ్చే విద్యా సంవత్సరానికి అనుమతులు ఇచ్చే విషయమై ఎన్‌ఎంసీ బృందం ఇటీవల కామారెడ్డి మెడికల్ కళాశాలను సందర్శించింది. ఇక్కడి సదుపాయాలు, సౌకర్యాలపై అసంతృప్తి వ్యక్తం చేసి నివేదికలను కేంద్రానికి సమర్పించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న డీఎంఈ నిర్వహించే సమావేశంపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.



నత్తనడకన సాగుతున్న మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు



టీచింగ్, అనాటమీ విభాగాలకోసం ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు

### ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం



కళాశాల భవనాల నిర్మాణం వచ్చే ఏడాదిలో పూర్తవుతుంది. ప్రస్తుతం సరిపడా భవనాలున్నాయి. కొన్ని సమస్యలున్నా విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం. బుధవారం నిర్వహించే డీఎంఈ వర్చువల్ సమావేశంలో అన్నీ వివరిస్తాం. మూడో ఏడాది ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి ఎన్‌ఎంసీ నుంచి అనుమతి లభిస్తుందన్న నమ్మకంతో ఉన్నాం.

– శివకుమార్, వైద్య కళాశాల ప్రిన్సిపల్

## క్లుప్తంగా

### అవార్డు గ్రహీతకు సన్మానం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన కొమ్ము వినోద్ రెడ్డిని హైదరాబాద్‌లో మంగళవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ఘనంగా సన్మానించారు. కొమ్ము వినోద్ రెడ్డి ఇటీవల వండర్ బుక్ ఆఫ్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డులను సొంతం చేసుకున్నాడు. దీంతో మధుయాష్కీ గౌడ్ ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు.

### లబ్ధిదారులకు మెరుగైన సేవలందించాలి



కామారెడ్డి టౌన్: ఆస్పత్రులకు వచ్చే ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందేలా చేయాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మేనేజర్ సత్యనారాయణ ఆరోగ్యశ్రీ మిత్ర, సిబ్బందికి సూచించారు. జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ ఆస్పత్రిలో మంగళవారం ఆరోగ్యశ్రీ సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు నిరంతరం సేవలు అందించేలా చూడాలన్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా టీం లీడర్లు అల్లావుద్దీన్, యశ్వంత్, ఆరోగ్య మిత్రలు పాల్గొన్నారు.

### క్రీడాకారులకు అభినందన



సుభాష్‌నగర్: హన్మకొండలో ఈ నెల 12 నుంచి 14 వరకు జరిగిన ఇంటర్ సర్కిల్ విద్యుత్ కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ టోర్నీలో తృతీయ స్థానం సాధించిన జిల్లా జట్టు క్రీడాకారులను ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఆర్ రవీందర్ మంగళవారం నగరంలోని పవర్ హౌస్ మీటింగ్ హాల్‌లో అభినందించారు. భవిష్యత్‌లో మొదటిస్థానంలో నిలవాలని, అందుకు అవసరమైన సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ తోట రాజశేఖర్, ఏఏవో గంగారాం, జేఏవో పూదరి గంగాధర్, సెక్రటరీ ఏ గోపి, కోశాధికారి వీ ఉత్తమ్‌సింగ్, దినేశ్, కేఎస్ఆర్ మూర్తి, కబడ్డీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

### కళాశాల వార్షికోత్సవం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాల వార్షికోత్సవం మంగళవారం స్థానిక లక్ష్మీదేవి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, ఆటపాటలతో వీక్షకులను అలరించారు. కళాశాల డైరెక్టర్లు హరి స్మరణ్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, అశోక్ రావు, బాలాజీ రావు, రాజేశ్వరరావు, ప్రిన్సిపల్ సాయిబాబు, అకాడమిక్ ఇన్‌చార్జి మనోజ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని గ్యాదరి అరవింద్ ఇంట్లో ఈ నెల 16న తెల్లవారుజామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆరోగ్యం బాగోలేక పోవడంతో అరవింద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా బీరువాలోని సామగ్రి చిందర వందరగా పడి ఉన్నాయి. దుండగులు 16 తులాల బంగారం, రూ. 30 వేల నగదు అపహరించినట్లు బాధితుడు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

# నిబంధనలు తూచ్!

- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు
- ఇసుక తవ్వకాల్లో ఇష్టారాజ్యం
- అడ్డగోలుగా తరలింపు
- అధికారుల పర్యవేక్షణ కరువు



బీర్కూర్ మండలం చించొల్లి వద్ద మంజీర నదిలో బారులు తీరిన ఇసుక ట్రాక్టర్లు

బాన్సువాడ: బీర్కూర్ మండలంలో ఇసుక తవ్వకాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. మంజీర ప్రాంతం నుంచి ఇసుక తవ్వకాలు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వేల ట్రాక్టర్ల ఇసుక పక్కదారి పడుతోంది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకను అందించాలని భావించినప్పటికీ ఇసుకాసురులకు మాత్రం వరంలా మారింది. బాన్సువాడ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బీర్కూర్ మండలంలోని బీర్కూర్, చించొల్లి, కిష్టాపూర్, బరంగెడ్గి, దామరంచ మంజీర ప్రాంతాల నుంచి ఉచిత ఇసుక కోసం అనుమతులు ఇస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ఇసుకాసురులు ఉచిత ఇసుకను పక్కదారి పట్టిస్తున్నారు. ఇసుక క్వారీల విషయంలో కఠిన నియమావళి అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ పనులకు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి తక్కువ ధరలో ఇసుక లభ్యత ఉండాలని కలెక్టర్లకు ఆదేశించిన విషయం తెలిసిందే. ప్రైవేటు ఇళ్లు, ఇతర నిర్మాణాలకు ట్రాక్టర్‌కు రూ.900 చలాను చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ 10 ట్రాక్టర్లకు చలాన్లు చెల్లించి వందల ట్రాక్టర్లు తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇందిరమ్మ ఇళ్లకు ఈ డీడీ చెల్లించాల్సిన అవసరం లేదు. ట్రాక్టర్ యజమానులతో మాట్లాడుకుని ఇసుకను తీసుకెళ్లాల్సి ఉంటుంది. అధికారులు ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాలను దగ్గర పెట్టుకుని ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి ఎంత మోతాదులో ఇసుక అవసరముంటుందో అన్ని ట్రాక్టర్లు మాత్రమే పంపించాలి. అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలి. కానీ ఇక్కడ అలా జరగడం లేదు. ట్రాక్టర్ల యజమానులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసమేనంటూ ఇసుక తరలిస్తూ ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తున్నారు. బీర్కూర్, బరంగెడ్గి, చించొల్లి, కిష్టాపూర్, దామరంచ గ్రామాల నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను బాన్సువాడ, వర్ని, నస్రుల్లాబాద్, గాంధారి మండలాలకు తరలిస్తున్నారు. ఇందుకు బీర్కూర్ తహసీల్ కార్యాలయంలో విధులు నిర్వహించే ఓ అధికారి కనుసన్నల్లో జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఆ అధికారి చలాన్ల కోసం కట్టాల్సిన డబ్బులు ఫోన్ పే ల ద్వారా తీసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

#### అనుమతి కోసం..

ఇసుక కావాల్సిన వారు ముందుగా పంచాయితీ కార్యదర్శి, ఆర్ఐ, నాయబ్ తహసీల్దార్, లేని పక్షంలో తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ప్రైవేటు వ్యక్తులు గ్రామాలు, పట్టణంలో ఇళ్లు నిర్మిస్తే పంచాయితీ, మున్సిపాలిటీ నుంచి అనుమతి పత్రంతో ఇసుక పొందే వీలుంది. ఇక ప్రభుత్వ అభివృద్ధి పనులకు పని పత్రాలు చూపి ఇసుకను పొందవచ్చు. ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక పొందవచ్చు. అధికారులు దగ్గరుండి ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా సరఫరా చేయాలి. వారు దరఖాస్తు చేసుకున్న తర్వాత తహసీల్దార్ అనుమతి ఇవ్వాలి. ఆ తర్వాత నిర్దేశించిన మొత్తాన్ని బ్యాంకులో చలాన్ రూపంలో చెల్లించాలి. దాని ఆధారంగా సైట్‌లో ఇసుక నిర్ణీత సమయంలో తీసుకెళ్లాలి. పైకి ఈ నిబంధనల ప్రకారమే ఇసుక సరఫరా జరుగుతున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అడ్డగోలుగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు.

### త్రినేత్ర శివలింగం.. ఉమామహేశ్వర ఆలయం

**మీకు తెలుసా?**



గోదావరి తీరంలోని ఉమమహేశ్వర ఆలయం

నందిపేట మండలం ఉమ్మెడ శివారులో గల గోదావరి నది పరీవాహక ప్రాంతంలో ఉన్న ఉమామహేశ్వర ఆలయం ఎంతో విశిష్టత కలిగి ఉంది.

- త్రేతాయుగంలో శ్రీరాముడు నడిచిన బాటలో గోదావరి నది ఒడ్డున ఇసుతో సైకత లింగాన్ని చేసి శివరూపాన్ని భక్తితో పూజించినట్లు పురాణాలు చెబుతున్నాయి.
- ఈ శివలింగం ప్రత్యేకతను తెలుసుకొని సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం 10, 11 వ శతాబ్దపు మధ్యకాలంలో కల్యాణ చాళుక్యుల మహారాజైన మహా మండలేశ్వరుడు కట్టించిన దేవాలయమని అని చరిత్ర ద్వారా తెలుస్తుంది.
- ఈ ఆలయంలో శివలింగం మీద త్రినేత్రం కనిపించడం విశేషం.
- దీపగండంగా పిలువబడే 108 దీపాల ధ్వజ స్తంభం ప్రత్యేకత.
- పోడశ స్తంభాలతో మండపం. ప్రతి స్తంభం మీద నాగ శాసనాలు, దేవాలయం చుట్టూ దాన శాసనాలు(ప్రతేక లిపితో రాసినవి) కలిగి ఉంటాయి.
- ప్రతి సంవత్సరం వర్షాకాలంలో గోదావరి బ్యాక్ వాటర్‌లో నీటమునిగే దేవాలయం, శివరాత్రి సమయంలో బయట పడుతుంది. మూడురోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తారు.
- నందిపేట మండల కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరంలో గోదావరి పరీవాహక ప్రాంతంలో నది ఒడ్డున ఉండడంతో ఈ ఆలయం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది.

– నందిపేట్

## ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సురేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు వేగవంతం చేయాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. మంగళవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణం వేగవంతంగా పూర్తి చేస్తే దశలవారీగా బిల్లులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, తదితరులున్నారు.

**విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి**

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పాఠశాలల్లో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేట కస్తూర్బా పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థినుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే తాండూర్ జీపీ కార్యాలయంలో పలు రికార్డులను, గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పలు సూచనలిచ్చారు.

## ఫీజుల దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

కామారెడ్డి టౌన్: జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలో ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి జి. సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. డీఈవో ఎస్.రాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ..నర్సరీ, ఎల్‌కేజీలకే రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. నాయకులు సాయికుమార్, శేఖర్, ప్రశాంత్, రాకేష్ తదితరులున్నారు.

**గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి**

జిల్లాలో గుర్తింపు లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ స్కూళ్లపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి జబ్బర్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తూ, స్కూల్ ఆవరణలోనే బ్యాగులు, బుక్స్, ఇతర సామగ్రి విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్నా జిల్లా విద్యా శాఖాధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. నాయకులు రాజు, మహేష్ ఉన్నారు.

## 'డబుల్' ఇళ్లను పేదలకు కేటాయించాలి



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ విక్టర్

భిక్కనూరు: మండల కేంద్రంలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను.. ఇల్లు లేని నిరుపేదలకు వెంటనే కేటాయించాలని అదనపు కలెక్టర్ విక్టర్ ఆదేశించారు. మంగళవారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో కిటికీలు, విద్యుత్ వైర్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని .. వాటికి తక్షణమే మరమ్మతులు చేయాలని సూచించారు. ఇల్లు లేని మహిళలు ఆయనను కలిసి తమకు ఇళ్లు కేటాయించాలని కోరారు. పీఆర్ ఈఈ దుర్గాప్రసాద్, డీఈఈ స్వామిదాస్, కామారెడ్డి ఆర్డీవో వీణ, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఆర్ఐ బాలయ్య, తదితరులున్నారు.

**మెరుగైన వైద్య సేవలు అందించాలి**

భిక్కనూరు: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అదనపు కలెక్టర్ విక్టర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. సమయపాలన పాటిస్తూ విధులకు హాజరుకావాలని సూచించారు. వైద్యాధికారి హిమీమా, ఆయుర్వేద వైద్యాధికారి వెంకటేశ్వర్లు, ఆరోగ్య విస్తర్ణ అధికారి వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.

### ఎల్లారెడ్డి డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కొత్త కోర్సు మంజూరైనట్లు ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో నూతనంగా ఫార్మాస్యూటికల్స్ మానుఫాక్చరింగ్ అండ్ క్వాలిటీ అనే కోర్సు మంజూరైందన్నారు. డిగ్రీ కళాశాలలో దోస్త్ అప్లికేషన్ల మూడవ దశ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

### వాహనాల వేలం వాయిదా



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం వాహనాల వేలంను వాయిదా వేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సుందల్ సింగ్ తెలిపారు. ఎల్లారెడ్డి ఎక్సైజ్ కార్యాలయంలో వ్యాగన్ ఆర్ కారు, గ్లామర్ బైకుకు సంబంధించి వాహనాల వేలం నిర్వహించారు. వేలానికి ఇద్దరు వ్యక్తులు మాత్రమే హాజరు కాగా ప్రభుత్వం నిర్ధారించిన ధర రాకపోవడంతో వాయిదా వేశారు. ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్, ఎస్సై శరత్‌కుమార్, తదితరులున్నారు.

### మంత్రి సీతక్కను కలిసిన జిల్లా కాంగ్రెస్ నేతలు



కామారెడ్డి టౌన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, నాయకులు పంపరి శ్రీనివాస్, పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీ, సాయిబాబా, సలీం, జూలూరి సుధాకర్ తదితరులున్నారు.

### రేపు ఒలింపిక్ డే రన్

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలో గురువారం ఒలింపిక్ డే రన్ నిర్వహించనున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధి కరు ణాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8.30 గంటలకు కామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద రన్ ప్రారంభమవుతుందని, ఇందిరాగాంధీ స్టేడియం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. క్రీడాభిమానులు, విద్యార్థులు, యువకులు ఒలింపిక్ రన్‌లో పాల్గొనాలని కోరారు.

## నిరుపేదలకు అండగా ప్రభుత్వం



మంజూరు పత్రం అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి

భిక్కనూరు: నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసి, లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం

**ఘనంగా బోనాల పండుగ**



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జప్తిజాన్కంపల్లిలో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. మాజీసర్పంచ దేశబోయిన సాయిలు, నాయకులు లక్ష్మాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**వెల్లుట్లలో..**



ఎల్లారెడ్డిరూరల్: వెల్లుట్లలో మంగళవారం బోనాల పండుగను నిర్వహించారు. గ్రామంలో బోనాలతో శోభాయాత్ర చేపట్టారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు.

**కాలభైరవుడికి వైభవంగా సిందూర పూజలు**



రామారెడ్డి: ప్రముఖ పుణ్య క్షేత్రం ఇసన్నపల్లి(రామారెడ్డి) శ్రీకాలభైరవుడి ఆలయంలో మంగళవారం సిందూర పూజలు నిర్వహించారు. అర్చకులు నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో ప్రభుగుప్తా, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

**ఎల్లమ్మ ఆలయంలో..**

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని గాలీపూర్ గ్రామ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం గౌడసంఘం ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

### నేడు బాన్సువాడలో యోగా వాక్

బాన్సువాడ: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని బుధవారం బాన్సువాడలో యోగా వాక్ నిర్వహించనున్నట్లు యోగా శిక్షకులు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే యోగా వాక్ ఉదయం 7 గంటలకు అంబేడ్కర్ చౌరస్తా నుంచి మినీ స్టేడియం వరకు కొనసాగుతుందని తెలిపారు. అధికారులు, పురప్రముఖులు, రాజకీయ నేతలు, యువకులు, కులసంఘాల నేతలు హాజరై ఈ యోగా వాక్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## క్రైం కార్నర్

### లైంగిక కోరిక తీర్చాలన్నందుకే హత్య

- తండ్రిని చంపిన కూతురి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్, నవీపేట ఎస్సై వినయ్

బోధన్: తండ్రిని రోకలి దుడ్డుతో కొట్టి చంపిన కూతురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. నవీపేట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నవీపేట మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన పల్లపు నర్సయ్య(54)కు ఇద్దరు కూతుళ్లు. ఇరువురికి వివాహం చేశారు. పెద్ద కూతురు గంగామణి భర్త మృతి చెందడంతో పదేళ్ల నుంచి ఇద్దరు పిల్లలతో కలిసి తల్లిదండ్రుల వద్ద ధర్మారంలోనే ఉంటుంది. పెద్ద కూతురు గంగామణి పట్ల నర్సయ్య అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. దీంతో ఇంట్లో గొడవలు జరిగి పది రోజుల నుంచి నర్సయ్య భార్య నర్సమ్మ, పెద్ద కూతురు నిజామాబాద్‌లో వేరుగా జీవిస్తున్నారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని తాళ్ల కొత్తపేట గ్రామంలో ఉంటున్న చిన్న కూతురు మక్కల వర్షిణి అలియాస్ మమత సోమవారం ధర్మారంలోని తండ్రి వద్దకు వచ్చింది. మద్యం మత్తులో ఉన్న నర్సయ్య లైంగిక కోరిక తీర్చాలని చిన్న కూతురుని వేధించాడు. ఆగ్రహించి పక్కనే ఉన్న రోకలి దుడ్డుతో తలపై రెండుసార్లు కొట్టడంతో నర్సయ్య అక్కడికక్కడే మరణించాడు. రక్తం, గాయాలు చూసి భయపడిన మమత ఇంటి తలుపులు దగ్గరగా మూసి అక్కడి నుంచి వెళ్లిపోయింది. నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో నవీపేట ఎస్సై వినయ్ పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని చందాపూర్ గ్రామశివారులో విద్యుదాఘాతానికి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మురళి తెలిపారు. గ్రామానికి చెందిన గడ్డం నారాయణరెడ్డి(69) సోమవారం తన గేదెలను మేపేందుకు గ్రామ శివారులో కౌలు చేస్తున్న రాజిరెడ్డి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. పొలం వద్ద గేదెలను మేపుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో నారాయణరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు రణదీప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

**లింగసముద్రంలో మరొకరు..**

డిచ్‌పల్లి: మండలంలోని లింగసముద్రం గ్రామానికి చెందిన గంగనర్సయ్య(59) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం గ్రామ శివారులోని తన పొలానికి నర్సయ్య వెళ్లాడు. పొలంలో మోటారు పనిచేయకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను టెస్టర్‌తో చెక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### యువతి ఆత్మహత్య

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన మసూరి పుష్ప(34) సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం ఉదయం పుష్ప ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో చుట్టుపక్కల వారు తలుపులు తట్టి లేపేందుకు యత్నించినా స్పందించలేదు. కుటుంబీకులకు సమాచారం అందించడంతో పక్కనే ఉంటున్న తల్లి చేరుకొని కిటికీల ద్వార లోపలికి చూడగా ఉరేసుకుని ఉన్నట్లు గుర్తించారు. పుష్పకు గతంలో నిర్మల్ జిల్లా ముథోల్ మండల కేంద్రానికి చెందిన వ్యక్తితో వివాహం జరిపించగా విడాకులు కావడంతో తల్లి గారింటి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన అశోక్ అనే యువకుడితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. ఇటీవల గర్భం రావడంతో పెళ్లి చేసుకోవాలని కోరింది. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినా అశోక్ అంగీకరించక పోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. తల్లి గంగామణి ఫిర్యాదు మేరకు అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

**పులాంగ్ వాగులో పడి వృద్ధుడు..**

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పులాంగ్ వాగులో పడి వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వినాయక్‌నగర్‌కు చెందిన రాజమౌళి(76) కొంత కాలంగా నరాల బలహీనత ఇబ్బందులు పడుతున్నాడు. చికిత్స చేయించుకున్నా తగ్గకపోవడంతో మంగళవారం పులాంగ్ వాగులో పడి మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### శతాధిక వృద్ధురాలు మృతి



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని దావల్‌మల్కపల్లి గ్రామంలో మంగళవారం శతాధిక వృద్ధురాలు మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని పట్టెం వెంకవ్వ (102) అనారోగ్యంతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఆమె అంత్యక్రియలకు దాక్షాయని స్వచ్ఛంద సంస్థ రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### కారు, బైకు ఢీకొని ఒకరు..



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ శివారులో మంగళవారం కారు, బైకు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఎల్లారెడ్డి నుంచి హసన్‌పల్లికి బైకుపై వెళ్తున్న అంజయ్యను బాన్సువాడ వైపు నుంచి కామారెడ్డి వైపునకు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రగాయమైనట్లు పేర్కొన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అంజయ్యను ఆటోలో ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా అంజయ్య మృతి చెందినట్లు తెలిపారు.